సాక్షి శ్రీకాకుళం

గురువారం । 17 । ఏప్రిల్ । 2025



బూటకపు హామీలతో మోసం

కూటమి పార్టీలు సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసగించాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ధ్వజమెత్తారు. - 8లో



కల్యాణం..కమనీయం..

కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న నాగావళి నదీతీరంలో కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్షిక తిరుక్కల్యాణోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. - 8లో

విద్యార్థులకు అభినందనలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ బ్రాంచ్ చెందిన 17 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్‌లు సాధించారు. అన్నా ఐటీ సొల్యూషన్స్, జేబీఎం ఆటో లిమిటెడ్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను వర్సిటీ అధికారులు బుధవారం అభినందించారు.

న్యూస్‌రీల్

ఏసీబీకి పట్టుబడ్డ డీఎంహెచ్‌వో సస్పెన్షన్

సాక్షి, అమరావతి: లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ శ్రీకాకుళం డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకట బాల మురళీకృష్ణ, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వి.సురేశ్‌కుమార్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. వైద్యశాఖ ఉద్యోగిని నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటూ వీరిద్దరూ ఈ నెల నాలుగో తేదీన ఏసీబీకి చిక్కారు. కోర్టు వీరికి ఈ నెల 17 నుంచి రిమాండ్ విధించింది. వీరిని సస్పెండ్ చేసినట్టు బుధవారం ఉత్తర్వులు ఇచ్చిన వైద్య శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల ఈ నెల నాలుగో తేదీ నుంచి సస్పెన్షన్ అమల్లోకి వస్తుందని వివరించారు.

బ్యాంకు పీఓగా రైతుకూలీ బిడ్డ



తల్లిదండ్రులతో శివాజీ

కంచిలి: మండలంలోని తలతంపర గ్రామానికి చెందిన రైతుకూలీ బిడ్డ నడుపూరి శివాజీ యూనియన్ బ్యాంకు పీఓ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. శివాజీ తండ్రి రామకృష్ణ రోజుకూలీగా జీవనం సాగిస్తున్నారు. తల్లి భాగ్యలక్ష్మి గృహిణి. శివాజీ నూజివీడు ట్రిపుల్ ఐటీలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. తర్వాత పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో బ్యాంకు పీఓ ఉద్యోగానికి ఎంపికకావడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఆర్‌డీటీపీ నాయుడు

శ్రీకాకుళం(పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు ఎక్కువగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని రీజనల్ డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి పి.నాయుడు అన్నారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏసీపీ, ప్లానింగ్ సెక్రటరీలతో బుధవారం సమావేశం నిర్వహించారు. అక్రమ నిర్మాణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే ప్లానింగ్ సెక్రటరీలపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. తూతూమంత్రంగా నోటీసులిచ్చి చేతులు దులుపుకొంటే సరిపోదని, నిర్మాణదారులకు సవివరంగా తెలియజేసి జరిమానాలు విధించాలన్నారు. సెట్‌బ్యాక్‌లు, ఆక్రమణలు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్లానింగ్ సెక్రటరీలదేనని స్పష్టం చేశారు. ఎల్ఆర్ఎస్ ద్వారా రూ 4.64 కోట్లు, బీపీఎస్ ద్వారా రూ.1.4 కోట్లు వసూలు చేశామని, ఆ మొత్తాన్ని కార్పొరేషన్ పరిధిలో రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు వినియోగిస్తామని చెప్పారు. నగరంలో ఇరుకుగా ఉన్న రోడ్లు వెడల్పు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతామన్నారు. సర్క్యులేషన్ ప్యాట్రన్ అమల్లోకి వచ్చిందని, దీనిపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. పాలకొండ రోడ్డు, రామలక్ష్మణ కూడలి వెడల్పు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు వెంకటేశ్వరరావు, జానకి పాల్గొన్నారు.

ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణకు కృషి



తాబేళ్ల పిల్లలను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులు


ఎచ్చెర్ల క్యాంపస్: సముద్ర జలాల్లో కాలుష్య నియంత్రణలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల పాత్ర కీలకమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. బొంతలకోడూరు పంచాయతీ పాతదిబ్బలపాలెం సముద్ర తీరంలో బుధవారం ఆలివ్ రిడ్లే తాబేళ్ల పిల్లలను సముద్ర జలాల్లో విడిచిపెట్టారు. తీరంపై తాబేళ్లు పెట్టిన గుడ్లను 45 రోజుల పాటు సంరక్షణ కేంద్రంలో ఉంచి ప్రత్యేకంగా పొదిగేలా అటవీశాఖ అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జలాల్లో తాబేళ్ల సంఖ్య పెరగాలని చెప్పారు. ప్రస్తుతం వేట నిషేధం 61 రోజులు అమల్లో ఉందని, తాబేళ్లు సురక్షితంగా పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖాధికారి వెంకటేష్, రేంజర్ రాజశేఖర్, ట్రీ ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ సోమేశ్వరరావు, సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు ఫీజుల ఎగవేత

పేదలకు అప్పుల వాత

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాక అవస్థలు

- కళాశాలల ఒత్తిడితో అప్పులు చేస్తున్న వైనం
- ఆర్థిక భారంతో ప్రైవేటు కళాశాలలు
- మెయింటెనెన్స్ ట్యూషన్ ఫీజులదీ అదే దారి
- రూ.106.75 కోట్లకు పైగా బకాయిలు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ప్రైవేటు కళాశాలల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫీజులు కట్టకపోతే పిల్లలను ఏ రోజు కాలేజీ నుంచి ఇంటికి పంపుతారో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. చదువు పూర్తయినా సర్టిఫికెట్ల విషయంలో సతాయిస్తుండటంతో నిత్యం భయపడుతూ గడుపుతున్నారు. మరోవైపు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో.. కాలేజీల నిర్వహణ కోసం విద్యార్థులే ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఫీజు వచ్చాక తిరిగి తీసుకోవాలని చెబుతున్నాయి. ముఖ్యంగా సర్టిఫికెట్ల కోసం వెళ్లిన విద్యార్థులకు ఫీజు చెల్లిస్తేనే ఇస్తామని కాలేజీ యాజమాన్యాలు చెప్పే పరిస్థితి వచ్చేసింది. దీంతో వారి తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ కాలేజీలకు ఫీజులు చెల్లిస్తున్నారు. అప్పులకు వడ్డీ భారం పెరుగుతున్నా సర్కారు మాత్రం రీయింబర్స్‌మెంట్ సొమ్ము విడుదల చేయడం లేదు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తే చేసిన అప్పులతో పాటు తమ ఖర్చులకు ఇబ్బందులు ఉండవని విద్యార్థులు నెలలు తరబడి వేచి చూస్తున్నారు. జిల్లాలో 45,657మంది విద్యార్థులకు ప్రభుత్వం రూ.106కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి పడి ఉంది.

మెయింటెనెన్స్ ట్యూషన్ ఫీజు సున్నా..

విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు మెయింటెనెన్స్ ట్యూషన్ ఫీజు(ఎంటీఎఫ్) కూడా చెల్లించలేదు. 2024–25 విద్యా సంవత్సరంలో ఒక్క రూపాయి విడుదల చేయలేదు. వాస్తవానికి డిగ్రీ, పీజీ, మెడికల్, ఇంజనీరింగ్ చదువుతున్న వారికి ఏడాదికి రూ.20 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఏడాదికి రూ.15వేలు, ఐటీఐ, డిప్లమో చదివే విద్యార్థులకు ఏడాదికి రూ.10 వేలు చొప్పున చెల్లించాల్సి ఉంది. జిల్లాలో 45,657 మంది విద్యార్థులు ఎంటీఎఫ్‌కు నోచుకోలేదు. దీంతో వసతి కష్టాలు తప్పడం లేదు.

ఆశయం నెరవేరేనా?

ఆమదాలవలస పట్టణంలోని మెట్టక్కివలస ప్రాంతంలో సీతారాంనగర్ లో నివాసముంటున్న పైడి నవ్యశ్రీ టెక్కలిలోని ఐతమ్ ఇంజినీరింగ్ కాలేజీలో గత ఏడాది జాయినయ్యింది. గత ప్రభుత్వం మాదిరిగా ఈ సర్కారు కూడా సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తుందని భావించింది. అయినా ఇంతవరకు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థి ని ఆందోళన చెందుతోంది. వేలాది రూపాయల ఫీజు చెల్లించాలని తల్లిదండ్రులపై ఒత్తిడి వస్తుండటంతో ఎలా చెల్లిస్తారో తెలియక భయాందోళనకు గురవుతోంది. ఇంజినీరింగ్ పూరి చేసి ఉన్నత శిఖరాలకు వెళ్లాలనే ఆశయం నీరుకారేలా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తోంది.



కాలేజ్ నుంచి ఒత్తిడి..

ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందనే నమ్మకంతో నా కుమార్తెను టెక్కలిలోని ఐతం కళాశాలలో ఇంజినీరింగ్‌లో చేర్పించాను. మధ్య తరగతి కుటుంబానికి చెందిన నాకు రోజువారి పనిలో సంపాదించింది కుటుంబ పోషణకు మాత్రమే సరిపోతుంది. ఏడాదికి సుమారు రూ.లక్ష వరకు ఖర్చు అవుతుంది. అంత మొత్తంలో ఖర్చులు పెట్టలేను. ఇటీవల కళాశాల నుంచి ఫోన్‌చేసి మొత్తం డబ్బులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. ఏం చెయ్యాలో తోచడంలేదు. ప్రభుత్వం, అధికారులు స్పందించి నా కుమార్తెకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చేలా చూడాలి. – పైడి లోకేశ్వరరావు, విద్యార్థిని నవ్యశ్రీ తండ్రి, ఆమదాలవలస



మానసికంగా ఇబ్బంది..

గార మండలం బోరవానిపేట గ్రామానికి చెందిన బోర హరి విశాఖపట్నం ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో ఎంబీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి తవిటినాయుడు గారలో ఓ రైస్ మిల్లులో కలాసీగా పనిచేస్తున్నాడు. తనలాగా కాకుండా కుమారుడిని ఎలాగైనా ఉన్నత చదువులు చదివించి ప్రయోజకుడ్ని చేయాలన్నది ఆయన కల. అయితే ఈ ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయకపోవడంతో యాజమాన్యం డబ్బులు చెల్లించాలని చెబుతోంది. ముందుగా మీరు డబ్బులు చెల్లించాలని, ప్రభుత్వం వేసినప్పుడు మీరే ఉంచుకోవాలని చెబుతున్నారు. రోజు వారీ కూలీపై ఆధారపడే కుటుంబం కావడంతో విద్యార్థి మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు.

అప్పు కోసం ప్రయత్నాలు..



కొడుకు చదువుతున్న కాలేజీ నుంచి డబ్బులు కట్టమని చెబుతున్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ వేస్తుందని ఎంతో ఆశతో ఎదురుచూశాం. ఏడాది పూర్తవుతోందని ఫీజు మీరే కట్టాలని అక్కడి నుంచి ఫోన్లు వస్తున్నాయి. అప్పు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాను. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయిలు చెల్లించాలి.
– బోర తవిటినాయుడు, విద్యార్థి తండ్రి, రైసు మిల్లు కలాసీ, గార మండలం

డబ్బులు కట్టకపోతే ఇంటికే..

పోలాకి మండలం పోలవలస గ్రామానికి చెందిన గేదల యువరాజ్ అనే యువకుడు కృష్ణా జిల్లా శేషాద్రి గుడ్లవల్లేరులో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందన్న నమ్మకంతో పేమెంట్ సీటులో జాయినయ్యాడు. తొలి ఏడాది రెండు విడతల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విద్యార్థి ఖాతాకు జమ అయ్యాయి. తర్వాత ఆరు వాయిదాలు బకాయిలు ఉండిపోయాయి. ఒక్కో వాయిదా రూ.18,500 కట్టాల్సి ఉంది. ప్రభుత్వం నిధులు జమ చేయకపోవడంతో డబ్బులు కట్టమని యాజమాన్యం ఒత్తిడి తెస్తోంది. కట్టక పోతే ఇంటికి వెళ్లిపొమ్మంటున్నారు. ఇంట్లో ఫీజు డబ్బులు కట్టే పరిస్థితి లేదు. ఏమి చేయాలో తోచడం లేదని విద్యార్థి వాపోతున్నాడు.

చదువు మాన్పించేయడమే..



నేను కాయకష్టం చేసుకొనే రైతును. ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందనే నమ్మకంతో అబ్బాయిని ఇంజినీరింగ్‌లో జాయిన్ చేశాం. ఇప్పుడు అంత డబ్బులు కట్టాలంటే కష్టమే. మరీ తప్పదంటే చదువు మానిపించేసి ఇంటికి తీసుకెళ్లిపోవడమే. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలి.
– గేదల శోభన్ విద్యార్థి తండ్రి, పోలవలస, పోలాకి మండలం

ఆ మొత్తం ఎప్పుడు చెల్లిస్తారో..?



చిత్రంలో కనిపిస్తున్న ఎం.సూర్యనారాయణది పశ్చిమగోదావరి జిల్లా. తల్లిదండ్రులు రామారావు, భారతి వ్యవసాయ కూలీలు. ఈఏపీఈఏపీ సెట్ ర్యాంకు ద్వారా ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ట్రిపుల్‌ఈ బ్రాంచ్‌లో ప్రవేశం పొందాడు. ప్రస్తుతం చివరి ఏడాదికి చేరుకున్నాడు. ఈ నెలలో చివరి సెమిస్టర్ పూర్తి చేసి, రిలీవ్ అవుతున్నాడు. కళాశాల ఫీజు స్ట్రక్చర్ రూ.43,000 కాగా, మొదటి విడత మాత్రమే రూ.10,750 విడుదలైంది. మిగిలిన డబ్బు మూడు విడతల్లో విడుదల చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. పూర్తి ఫీజు చెల్లించకపోతే కళాశాల యాజమాన్యం విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు అందజేయదు. దీంతో విలువైన సమయం, ఉద్యోగ అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని విద్యార్థి ఆందోళన చెందుతున్నాడు.

జిల్లాలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన విద్యార్థుల సంఖ్య	2024-25లో రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్	ఇప్పటి వరకు విడుదలైన నిధులు	రావల్సిన బకాయిలు	మెయింటెనెన్స్ ట్యూషన్ ఫీజుకు అర్హులైన విద్యార్థుల సంఖ్య	ఇంతవరకు విడుదల చేసిన నిధులు	డిగ్రీ, పీజీ, మెడికల్, ఇంజనీరింగ్ వారికి ఏడాదికి ఇవ్వాల్సిన ఫీజు	పాలిటెక్నిక్ విద్యార్థులకు అందాల్సిన ఫీజు	ఐటీఐ, డిప్లమో విద్యార్థులకు అందాల్సిన ఫీజు
45,657	రూ.142.34 కోట్లు	రూ.35.58 కోట్లు	రూ.106.75 కోట్లు	45,657	0	రూ.20 వేలు (ఒక్కో విద్యార్థికి)	రూ.15వేలు (ఒక్కో విద్యార్థికి)	రూ.10వేలు (ఒక్కో విద్యార్థికి)

హోంమంత్రి

బురద రాజకీయం



శ్రీకాకుళం నగరంలో చర్చి గోడలపై అన్యమత రాతలు రాసిన వ్యక్తులను అరెస్టు చేసిన సందర్భంగా ప్రచురితమైన కథనం



జలుమూరు ఘటనపై నిందితులను అరెస్టు చేసిన సందర్భంగా ప్రచురితమైన కథనం

- దేవాలయాలు, చర్చిలపై అన్యమత రాతలు
- వాటిని ప్రతిపక్షానికి అంటగడుతూ నోరు పారేసుకున్న మంత్రి అనిత
- అంతకుముందే అసలు కారణాలు వెల్లడించిన ఎస్పీ


సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

‘నరసన్నపేటలోని ఒక టెంపుల్‌పై జీసస్ వర్డ్స్ రాయించారు. ఒక చర్చిపై జై శ్రీరామ్ అని రాయించారు. ఇలాంటి సంఘటనలు చూస్తుంటే ఏదో విధంగా మత కల్లోలాలు తీసుకురావాలి. ఇక్కడ లా అండ్ ఆర్డర్ ఇష్యూను క్రియేట్ చేయాలన్న దృక్పథం చాలా క్లియర్‌గా కన్పిస్తుంది. నేను చాలా సందర్భాల్లో చెబుతున్నాను.. ఒక క్రిమినల్ పొలిటిక్స్‌లో ఉంటే ఇలాంటి సంఘటనలు జరుగుతాయని. ఇలాంటి సంఘటనలు పునరావృతం చేయడానికి రెడీ అవుతున్నారు. అయినా వారు ఏమీ చేయలేరు.మేమంతా అలెర్ట్‌గా ఉన్నాం’ అంటూ మంగళవారం మీడియా సమావేశంలో హోం మంత్రి అనిత చేసిన వ్యాఖ్యలు బాధ్యతా రాహిత్యమని స్పష్టమైంది. ఆయా రాతలకు సంబంధించి ముగ్గురు అసలైన నిందితులను పోలీసులు అరెస్టు చేయడమే ఇందుకు నిదర్శనం. జలుమూరు మండలం యలమంచిలి గ్రామం ఎండల కామేశ్వరస్వామి గుడి లోపలి కాంపౌండ్ గోడపై, అదే గ్రామంలో అసిరితల్లి గుడి వద్ద, కామినాయుడుపేట కొండపోలవలసలో ఆంజనేయస్వామి గుడి గోడపై మతపరమైన రాతలపై పోలీసులు విచారణ జరిపి పీటర్ జాన్, పాగోటి ఈశ్వరరావు, మామిడి అజయ్ అనే ముగ్గుర్ని అరెస్టు చేశారు. వ్యక్తిగత కక్షలతో వీరు గత నెల 29వ తేదీన ఆ రాతలు రాసినట్లు దర్యాప్తులో తేలిందని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఈనెల 14న మీడియా సమావేశంలో వెల్లడించారు. కాగా, ఈ నెల 1న శ్రీకాకుళం టౌన్ హాల్ రోడ్డులోని ఆర్‌సీఎం సెయింట్ థామస్, చిన బజారు రోడ్డులో ఉన్న తెలుగు బాప్టిస్టు చర్చి రక్షణ గోడలపై అన్యమత రాతలు రాసిన గూనపాలెం మేదరవీధికి చెందిన నర్రు దుర్గాప్రసాద్, అదే వీధికి చెందిన గ్రంధి సోమశేఖర్‌లను కూడా అరెస్టు చేశామని ఎస్పీ ఈ నెల 3వ తేదీనే మీడియాకు తెలిపారు. తద్వారా ఈ రెండు ఘటనలు వేర్వేరని స్పష్టం అవుతోంది.

దీన్నేమంటారు?

రాష్ట్రంలో అధికారంలో ఉన్నది తెలుగుదేశం కూటమి ప్రభుత్వం. శ్రీకాకుళంలో ఉన్నది వారు నియమించిన ఎస్పీయే. ఇక్కడ జరిగిన ఘటనలపై విచారణ జరిపిన తర్వాత ఆయా ఘటనలకు గల కారణాలను, నిందితులను మీడియా ఎదుట ప్రవేశ పెట్టి వివరించారు. కానీ హోంమంత్రి అనిత మాత్రం అందుకు భిన్నంగా మంగళవారం స్పందిస్తూ ప్రతిపక్ష పార్టీకి ఆపాదించేలా వ్యాఖ్యలు చేయడం దుర్మార్గం. ఇప్పుడు ఇక్కడ ఎవరివి క్రిమినల్ పాలిటిక్స్? దీన్నిబట్టి హోం మంత్రి అనిత ఎంత దారుణంగా అబద్ధాలు, అవాస్తవాలను వల్లిస్తున్నారో అర్థమవుతోంది. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్రంలో ఏం జరిగినా దానిని ప్రత్యర్థులపైకి నెట్టేయడానికి ప్రయత్నిస్తున్నారనడానికి ఈ ఘటనలే నిలువెత్తు సాక్ష్యాలు.

● తూరుపు వేలుపు విలాసం



వేటూరి ఊహల వాహినిలో కరిగిపోయిన వంశధార నదీ తీరంలో.. వేకువ సమయాన తూరుపు దిశలో ఆకాశం రాగరంజితమైన వేళ.. ఆ కాంతులలో కర్మసాక్షి దరహాస దీపికలు ఇలా కనువిందు చేసాయి. సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం వద్ద బుధవారం ఈ సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. చూపరుల మది దోచుకుంది. - సరుబుజ్జిలి

తీయని విజయం

స్వయంశక్తి సంఘం సాయంతో అతివ విజయ బావుటా ● స్వీట్స్ షాప్ ఏర్పాటుతో పది మందికి ఉపాధి



పుష్కర కాలానికి మునుపు ఆమె ఓ కూలి. ఆమె భర్త ఓ వలస జీవి. పన్నెండేళ్లు తిరిగే సరికి ఇద్దరూ ఓ పెద్ద స్వీటు షాపునకు ఓనర్లయ్యారు. పది మందికి ఉపాధి చూపించారు. ఈ తీయని విజయం వెనుక వారి కఠోర శ్రమ దాగి ఉంది. అందుబాటు వనరులను వాడుకున్న చాకచక్యం కనిపిస్తుంది. అప్పులు ఎప్పుడు, ఎందుకు చేయాలో వివరించే విజయ సూత్రం ఇమిడి ఉంది. కవిటి గొండ్యాలపుట్టుగలోని మిఠాయి షాపు యజమానుల ప్రస్థానం ఆదర్శప్రాయంగా మారింది.



కవిటి: గణపతి స్వీట్స్.. కవిటి గొండ్యాలపుట్టుగలో ఫేమస్ దుకాణం. ఈ దుకాణం ఎంత ప్రసిద్ధి చెందిందో ఆ యజమానుల విజయ ప్రస్థానం కూడా అంతే కీర్తి పొందింది. 2013 ముందు వరకు గొండ్యాలపుట్టుగకు చెందిన డొంకాన స్వాతి సాధారణ కూలి పనులు చేసేవారు. ఆమె భర్త గోపి నాగ్‌పూర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసేవారు. వీరికి ఇద్దరు పిల్లలు. జీవితంలో ఎదగాలని ఉన్నా అవసరాలు, బాధ్యతలు అన్నీ మర్చిపోయేలా చేసేవి. ఆఖరుకు 2013లో స్వాతి స్వయం సహాయక సంఘంలో చేరి ఒక రూ.లక్ష రుణం తీసుకున్నారు. ఏదో చిన్న వ్యాపారం ప్రారంభించి ఆ రుణం తీర్చేద్దామని అనుకున్నారు. అప్పటికే పదేళ్లు నాగ్‌పూర్‌లోని ఓ స్వీట్‌స్టాల్‌లో పని చేసిన స్వాతి భర్త సొంతూరికి తిరిగి వచ్చేశారు. తన అనుభవంతో సొంతంగా ఓ స్వీట్స్‌తయారీ కేంద్రం ప్రారంభించాలని సంకల్పించారు. చిన్నగా పని మొదలుపెట్టారు. 2021లో తమ గ్రామానికి చెందిన వీఓఏతో కలిసి కవిటి మండల మహిళా సమాఖ్య అధికారులను వారిద్దరూ కలిశారు. తమ ఆలోచనను వ్యాపారం వివరాల్ని వివరించారు. ఏపీఎం కె.గోవింద్ వారికి తోడ్పాటు అందించారు. కవిటి మండల మహిళా సమాఖ్య నుంచి సీడ్ క్యాపిటల్ రూ.40,000, స్త్రీనిధి రుణం రూ.50,000, బ్యాంక్ లింకేజీరూ.100,000, ముద్ర రుణం రూ.2లక్షలు వెరసి రూ.3,90,000 వ్యాపార రుణం అందించారు. దీంతో 2023లో బాదం హల్వా, సోన్‌పాపిడీ తయారీ పరికరాల్ని కొనుగోలు చేశారు. స్వాతి భర్త గోపి తనకున్న నైపుణ్యంతో అందరినీ మెప్పించారు. గ్రామంలో మొదట ప్రారంభమైన వ్యాపారం ప్రస్తుతం పొరుగు రాష్ట్రం గ్రామాలకు కూడా విస్తరించింది. రోజూ 10 మంది వరకు మహిళలకు ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తున్నారు.

ఉపాధి కల్పిస్తూ..

మొదట్లో ఈ వ్యాపారం పెట్టినప్పుడు మాకు ఎంతో ఆందోళన ఉండేది. భారీగా అప్పు చేశాం. విజయం సాధిస్తామా లేదా అనే అనుమానంతోనే భార్యాభర్తలం ఇద్దరం కష్టపడ్డాం. నేడు విజయవంతమైన వ్యాపారం నడుపుతున్నాం. మరో పదిమందికి ఉపాధి ఇవ్వగలుగుతున్నాం.
– డొంకాన స్వాతి, గొండ్యాలపుట్టుగ

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణపై అవగాహన కార్యక్రమాలతోపాటు చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్టు డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు చిత్రలేఖన పోటీల నిర్వహించాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. మండల స్థాయి చిత్రలేఖన పోటీలు ఈ నెల 17న మండల కేంద్రాలలో నిర్వహిస్తామని చెప్పారు. అందులో ప్రథమ, ద్వితీయ స్థాయిల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయాలని మండల విద్యాశాఖాధికారులకు సూచించారు. జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు ఈ నెల 18న శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామని పేర్కొన్నారు. వీరికి ఈ నెల 19న బహుమతుల ప్రదానం చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

పశువుల పట్టివేత

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం నారాయణవలస సమీపంలో వ్యాన్‌లో 13 ఆవులను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు కోటబొమ్మాళి ఎస్ఐ వి.సత్యనారాయణ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. పశువులను తరలిస్తున్న వ్యాన్‌ను ఆపగా 12 మగదూడలు, ఒక ఆవు ఉన్నట్లు గుర్తించి వాటిని విజయనగరం జిల్లా కొత్తవలస గోశాలకు తరలించారు. అనంతరం ఆవులు అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేశారు.

కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని వినతి


ఐటీడీఏ పీఓను కలిసిన అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

సారవకోట: జిల్లాలోని గిరిజన పాఠశాలలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సీతంపేట ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ మేరకు సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో కలిసి సమస్యలను వివరించారు. గిరిజన పంచాయతీలలో ఆరోగ్య ఉప కేంద్రాలు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించాలని, తాగునీటి సమస్య లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బైరిసింగి లక్ష్మినారాయణ, అడవి రాముడు, చౌదరి లక్ష్మినారాయణ, కొచ్చ శ్రీను, సింహాచలం పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య

రణస్థలం: మండలంలోని వెంకటరావుపేటకు చెందిన కొత్తకోట సత్యం(59) అనే వృద్ధురాలు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్నాళ్లుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న సత్యం మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో గడ్డిమందు తాగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు గమనించి రణస్థలం సీహెచ్‌సీకి తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలికి భర్త ఎల్లయ్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైవేపై అక్రమ వసూళ్లు!


హైవేపై అనధికార వ్యక్తులు

ఇచ్ఛాపురం టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని బెల్లుపడ సమీపంలో పాత టోల్‌గేటు వద్ద అనధికార వ్యక్తులు వ్యవసాయ మార్కెట్ కమిటీ పేరుతో అక్రమ వసూళ్ల దందా సాగిస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పేరిట రసీదు బుక్ చూపించి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో ఇంటిగ్రేడ్ చెక్‌పోస్టు ఉన్నప్పుడు అక్రమంగా వస్తువులు రవాణా చేస్తే వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేసేవారు. ఇంటిగ్రేడ్ చెక్‌పోస్టు తొలగించాక అపరాధ రుసుం వసూలు చేయడం ఆగిపోయింది. ప్రస్తుతం మార్కెట్ కమిటీలో కొందరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, తోటపని చేసే వారు హైవేపై వ్యవసాయ ఉత్పత్తుల లారీల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. స్థానికులు, అధికారులు వచ్చే సమయంలో ఏమీ తెలియనట్లు పక్కకు జారుకుంటున్నారు. ఈ విషయమై వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ ఆంద్రయ్య వద్ద ప్రస్తావించగా గతంలో కవిటి మండలం కరాపాడు టోల్‌గేటు వద్ద లారీలు ఆపి వ్యవసాయ ఉత్పత్తులు రవాణా చేసే లారీల నుంచి పన్ను వసూలు జరిగేదని, టోల్ గేట్ వారు అభ్యంతరం చెప్పడంతో పాత టోల్‌గేటు వద్దకు మార్చామని చెప్పారు. సూపర్‌వైజర్లు, ఇతర అధికారులే పన్ను వసూలు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

పెన్షనర్ల సమస్యలపై వినతి

శ్రీకాకుళం అర్బన్: పెన్షనర్‌ల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ అధ్యక్షుడు సుబ్బరాయన్ పాలంకి, ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ చౌదరి పురుషోత్తమనాయుడు, జనరల్ సెక్రటరీ సతీష్‌కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును రాష్ట్ర సెక్రటేరియేట్‌లో కలిసి వినతిపత్రం అందించారు.

బూటకపు హామీలతో మోసం


ఎచ్చెర్ల మండల పార్టీ అధ్యక్షుడు బొర సాయిరాంరెడ్డి, అజ్జరాం సర్పంచ్ స్రవంతిలను సన్మానిస్తున్న ధర్మాన కృష్ణదాస్, గొర్లె కిరణ్‌కుమార్


హాజరైన నాయకులు

- కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకతను జనంలోకి తీసుకెళ్లాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్:

కూటమి పార్టీలు సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసగించాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సమక్షంలో ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడుపేట సమీపంలో ఎచ్చెర్ల మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ పరిచయ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎచ్చెర్ల మండల పార్టీ అధ్యక్షుడు బొర సాయిరాం రెడ్డి, అజ్జరాం సర్పంచ్ స్రవంతి, మండల పార్టీ కార్యవర్గాన్ని సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే పరిస్థితి ఉందన్నారు. ప్రజలను భయపెట్టి విధ్వంస పాలన ఎన్నాళ్లూ సాధ్యం కాదని స్పష్టం చేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కార్యకర్తలకు ప్రాధాన్యమిస్తున్నారని, అందరి సూచనలు, సలహాలు తీసుకుంటారని, క్షేత్రస్థాయి పరిస్థితి వివరించవచ్చని చెప్పారు. రాష్ట్రంలో పాలన గాడితప్పిందన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు నిర్వీర్యమయ్యాయని చెప్పారు. రాష్ట్రమంటే అమరావతి కాదని, ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలపై ఒక్కసారైనా దృష్టిపెట్టాలని ప్రభుత్వానికి సూచించారు.

సమష్టిగా పనిచేద్దాం..

మాజీ ఎమ్మెల్యే, ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీలో ఏకపక్ష నిర్ణయాలు ఉండవని, సమష్టిగా చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. 2014లో అధికారం కోల్పోయినా నిరాశ చెందకుండా 2019లో అధికారంలోకి వచ్చామని, రానున్న ఎన్నికల్లోనూ తప్పక విజయం సాధిస్తామన్నారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు, ప్రభుత్వ పథకాల్లో రాజకీయ జోక్యం, తప్పుడు కేసుల నమోదు వంటి వాటిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండల పార్టీ అధ్యక్షులు బొర సాయిరాంరెడ్డి, దన్నాన రాజినాయుడు, గొర్లె శ్రీనివాసరావు, డోల వెంకటరమణ, జెడ్పీటీసీలు మీసాల సీతంనాయుడు, కాయల వెంకటరమణ, నాయకులు, ప్రజా ప్రతినిధులు రొక్కం బాలకృష్ణ, ఎన్ని ధనుంజయ, మీసాల వెంకటరమణ, జరుగుళ్ల శంకరరావు, బల్లాడ జనార్దనరెడ్డి, బెండు రామారావు, కె.వి.వి.సత్యనారాయణ, మూగి శ్రీరాములు, అంబటి రాంబాబు, పంచిరెడ్డి రాంబాబు, తమ్మినాయుడుపేట నాయకులు సనపల సూరిబాబు, వావిలపల్లి వెంటరమణ, యండ రమేష్, గురుగుబెల్లి దివాకర్, గురుగుబెల్లి రామచంద్రరావు, పంచాది లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు నవోదయం 2.0


రికార్డులను పరిశీలిస్తున్న డీసీ శ్రీకాంత్‌రెడ్డి

పాతపట్నం: నాటుసారా నిర్మూలనకు ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమం చేపడుతోందని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి అన్నారు. పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఒడిశా, ఆంధ్ర చెక్‌పోస్టులను బుధవారం పరిశీలించారు. అనంతరం పాతపట్నం ఎక్సైజ్ సీఐ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా నుంచి ఆంధ్రకు నాటుసారా, మద్యం రవాణా చేసే రహదారుల వద్ద తనిఖీలు విస్తృతం చేయాలన్నారు. సరిహద్దు గ్రామాలపై దృష్టి సారించాలన్నారు. కొండపై ఉన్న గూడలకు వెళ్లి తనిఖీలు చేపట్టాలని సూచించారు. సారా రహిత జిల్లాగా చేయాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. ఆయనతో పాటు పాతపట్నం ఎక్సైజ్ సీఐ కె.కృష్ణారావు, ఎస్ఐ శ్రీనివాసరావు ఉన్నారు.

కళాకారులకు కందుకూరి పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న కుమార్‌నాయక్, చలపతిరావు

శ్రీకాకుళం కల్చరల్/పలాస/కవిటి: జిల్లాకు చెందిన పలువురు కళాకారులు బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా కందుకూరి పురస్కారాలు అందుకున్నారు. అవార్డులు అందుకున్న వారిలో మెట్ట పోలినాయుడు, గుత్తి చిన్నారావు, డాక్టర్ కుమార్‌నాయక్, బెందాళం శోభన్ బాబు, బల్లెడ చలపతిరావు ఉన్నారు.


పురస్కారాలతో మెట్ట పోలినాయుడు, శోభన్‌బాబు, చిన్నారావు

● నిప్పు.. నిర్లక్ష్యంగా ఉంటే ముప్పు



ఇంట్లో అగ్ని ప్రమాదాల నివారణపై మహిళలందరూ అవగాహన కలిగి ఉండాలని రణస్థలం అగ్నిమాపక అధికారి పైల అశోక్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని బహుళ అంతస్తుల భవనంలో అవగాహన కల్పించారు. ఎలక్ట్రికల్ వస్తువులు షార్ట్‌సర్క్యూట్ అయినప్పుడు మంటలు చెలరేగినప్పుడు, వంట గదిలో గ్యాస్ సిలిండర్‌కు మంటల వ్యాప్తించినా వెంటనే ఎలా అరికట్టాలో నేరుగా చేసి చూపించారు.

\- రణస్థలం

బీచ్ ఫెస్టివల్‌కు సన్నద్ధం


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సోంపేట: బారువలో ఈ నెల 19, 20వ తేదీల్లో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం బారువ బీచ్‌ను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 19న ప్రారంభం కానున్న బీచ్ ఫెస్టివల్‌కు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి అచ్చెన్నాయుడు హాజరవుతారని చెప్పారు. అదే రోజు సాయంత్రం 5.30 గంటలకు తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి విడిచిపెడతామని తెలిపారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా బీచ్ క్లీనింగ్ జరుగుతుందన్నారు. క్రీడాపోటీలు, వీలైతే బోటింగ్ పోటీలు కూడా నిర్వహిస్తామని తెలిపారు. పంచాయతీ, పర్యాటక, అగ్నిమాపక, రహదారులు భవనాలు, అటవీశాఖ, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

2.50 లక్షల మంది విద్యార్థులు లక్ష్యం



పోలాకి: రానున్న విద్యాసంవత్సరంలో జిల్లాలో 2.50 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివేలా లక్ష్యం నిర్దేశించుకున్నట్లు డీఈఓ తిరుమల చైతన్య తెలిపారు. బుధవారం పోలాకిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం 2.44 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చదువుతుండగా వారిలో 29 వేల మంది పదో తరగతి విద్యార్థులు రిలీవ్ కానున్నారని చెప్పారు. మరో 35 వేల మంది విద్యార్థులు కొత్తగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ప్రతి తరగతికి ఉపాధ్యాయున్ని నియమించాలన్న ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పాఠశాలల క్రమబద్ధీకరణ జరుగుతోందని చెప్పారు. ఆ వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని డీఈవో తెలిపారు. దాదాపు ప్రతి పంచాయతీ పరిధిలో మోడల్‌స్కూల్ ఉండేలా కృషిచేస్తున్నామని చెప్పారు.

పశువుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

కంచిలి: ప్రకృతి వైపరీత్యాల నుంచి పశువుల్ని రక్షించుకోవాలని భువనేశ్వర్‌కు చెందిన ఇంటర్నేషనల్ లైవ్ స్టాక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు డాక్టర్ అరుణ్‌కుమార్ పండా, డాక్టర్ బ్రీగేంద్ర అన్నారు. కంచిలి, కవిటి మండలాలకు చెందిన మహిళా పాడిరైతులతో సోంపేట మార్గంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వైపరీత్యాల వల్ల పశువుల పెంపకంలో కలిగే సమస్యలు, వాటి పరిష్కారాలు, పశువుల పెంపకంలో మహిళల పాత్రను వివరించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ కె.రాజగోపాల్, సోంపేట సహాయ సంచాలకులు డాక్టర్ కె.అప్పలస్వామి, పశువైద్యాధికారులు డాక్టర్ టి.శిరీష, డాక్టర్ జి.కిరణ్‌కుమార్, డాక్టర్ సంజయ్ కుమార్, కంచిలి ఏపీఎం అప్పలనర్సమ్మ, మహిళా పాడి రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఫ్లెక్సీల తొలగింపు



వైఎస్సార్ విగ్రహం చుట్టూ ఉన్న ఫ్లెక్సీలను తొలగించిన దృశ్యం

శ్రీకాకుళం పరిధిలోని పెదపాడులో వైఎస్సార్ విగ్రహం చుట్టూ టీడీపీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై 'విగ్రహాన్ని కప్పేశారు' శీర్షికన ఈ నెల 14న సాక్షిలో ఫొటో కథనం ప్రచురితమైంది. విషయం ఉన్నతాధికారుల దృష్టిలోకి వెళ్లడంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. బుధవారం ఫ్లెక్సీలను పూర్తిగా తొలగించడంతో వైఎస్సార్ అభిమానులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

\- శ్రీకాకుళం రూరల్

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన బైక్

- కె.కుపాసుకుద్ది గ్రామ యువకుడు దుర్మరణం


మృతదేహం వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు, (ఇన్‌సెట్లో) గోకిడి రవి(ఫైల్)

ఇచ్ఛాపురం : ఈదుపురం రోడ్‌లో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కవిటి మండలం కె.కపాసుకుద్ది గ్రామానికి చెందిన గోకిడి రవి(25) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కె.కుపాసుకుద్ది గ్రామానికి చెందిన గోకిడి మాధవరావు, వేణు దంపతుల కుమారుడు రవి విదేశాల్లో వెల్డింగ్ పనుల చేసుకొంటూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండేవాడు. ఇరాక్ నుంచి నెల రోజుల కిందట ఇంటికి వచ్చాడు. మంగళవారం రాత్రి ఇంట్లో భోజనం చేసి ఇచ్ఛాపురంలో తన స్నేహితులను కలిసేందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా ఈదుపురం రోడ్డులోని ఇటుకల బట్టీ సమీపంలో మలుపు వద్ద అదుపు తప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి గుంతలో పడిపోయాడు. అర్ధరాత్రి కావడంతో ఎవరూ గమనించలేదు. దీంతో యువకుడు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఉదయం అటువైపుగా వెళ్తున్న వారు మృతదేహాన్ని గమనించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి వివరాలు సేకరించి మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. తండ్రి మాధవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై ముకుందరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చేతికందిన కొడుకు అనంతలోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఐటీడీఏపై కూటమి నేతల హామీలు ఏమయ్యాయి?


సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): గిరిజన గ్రామాలు అధికంగా ఉన్న శ్రీకాకుళం జిల్లాలో ఐటీడీఏ లేకపోవడం దారుణమని, తాము అధికారంలోకి వస్తే ఐటీడీఏ తప్పక ఏర్పాటుచేస్తామని కూటమి నేతలు ఎన్నికల ముందు హామీలు గుప్పించి నేడు పట్టించుకోకపోవడం దారుణమని ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ కో–చైర్మన్ డాక్టర్ మీడియం బాబూరావు అన్నారు. జిల్లా కేంద్రంలో యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, జీసీసీ ద్వారా కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేశారు. విభజిత శ్రీకాకుళం జిల్లాలో సుమారు 1.50 లక్షల మంది ఆదివాసీలు జీవిస్తున్నారని, ఉమ్మడి జిల్లా ఉన్నప్పుడు సీతంపేట ఐటీడీఏ శ్రీకాకుళం జిల్లాలో భాగంగా ఉండేదని, ఆ తర్వాత పార్వతీపురం మన్యం జిల్లాలో విలీనం కావడంతో శ్రీకాకుళం గిరిజనులకు ఐటీడీఏ లేకుండా పోయిందన్నారు. గత నెలలో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ సమావేశంలో స్వయంగ రాష్ట్ర గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి శ్రీకాకుళం జిల్లాలో నూతన ఐటీడీఏ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం తగదన్నారు. ఆదివాసీలు నివసిస్తున్న ఒక్క గ్రామం కూడా షెడ్యూల్ ఏరియాలో లేకపోవడంతో ఆదివాసీల భూమి, అడవులకు రక్షణ లేకుండాపోయిందన్నారు. బూర్జ మండలంలో అణు విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, శ్రీకాకుళం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గొంతు అప్పారావు, ఎన్.అప్పన్న, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సవర పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ మూర్తి ఇక లేరు

- నేత్రాలను సేకరించిన ప్రతినిధులు


సి.వి.ఎన్.మూర్తి(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: సి.వి.నాగజ్యోతి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకుడు, రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు సి.వెంకట నర్సింహమూర్తి(82) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్టు హౌస్ వద్ద సీవీ నాగజ్యోతి ఆనంద నిలయం(వృద్ధాశ్రమం) నిర్మాణ దాతగా, అనేక దేవాలయాల అభివృద్ధికి విరాళాలు అందించిన మూర్తి కొంతకాలంగా వృద్ధాశ్రమంలోనే ఉంటున్నారు. ఎలక్ట్రికల్ ఇంజినీరుగా పనిచేసిన మూర్తి తన జీవిత చరమాంకంలో కుమార్తె నాగజ్యోతి పేరిట చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి ఇప్పటి వరకు సుమారు మూడు లక్షల మందికి భోజనం పెట్టారు. ఆయన మృతి పట్ల రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, సభ్యులు మల్లా చక్రవర్తి, దుర్గా శ్రీనివాసరావు, తదితరులు విచారం వ్యక్తం చేశారు. ఆయన నేత్రాలను రెడ్‌క్రాస్ ప్రతినిధులు సేకరించారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు


నుజ్జయిన కారు ముందు భాగం

టెక్కలి రూరల్: మండలంలోని లచ్చన్నపేట సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కారు ధ్వంసమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం నుంచి భువనేశ్వర్ వైపు వెళ్తున్న కారు లచ్చన్నపేట మలుపు వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందుభాగం పూర్తిగా నుజ్జయ్యింది. ట్రాక్టర్ డ్రైవర్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కారులో ఉన్న వ్యక్తులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య


మృతుడు కేశవరావు

టెక్కలి రూరల్: స్థానిక ఎన్టీఆర్ కాలనీ 7వ లైన్‌లో నివాసముంటున్న ముడిదాన కేశవరావు(38) బుధవారం రాత్రి తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగాం మండలం హుకుంపేట గ్రామానికి చెందిన కేశవరావు టెక్కలి ఎన్టీఆర్ కాలనీ 7వ లైన్‌లో నివాసం ఉంటున్నాడు. భార్య నాగమణి నాలుగేళ్ల క్రితం మృతిచెందింది. పిల్లలు రమ్య, గణేష్ బంధువుల ఇంటికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో బుధవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న టెక్కలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా, తాపీమేస్త్రీగా పనిచేసే కేశవరావు అప్పులు అధికంగా వాడినట్లు తెలుస్తోంది. ఇటీవల ఇంటి కరెంట్ బిల్లు సైతం కట్టకపోవడంతో కనెక్షన్ కట్‌చేశారని, ఫైనాన్స్ కట్టకపోవడంతో ద్విచక్ర వాహనం సైతం తీసుకెళ్లిపోయారని, మద్యానికి బానిస కావడంతో చివరకు మనస్తాపం చెంది మృతిచెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. మృతుడి మామ జామి భీమరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్కలి ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్యాణం.. కమనీయం..

పాతశ్రీకాకుళంలో కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న నాగావళి నదీతీరంలో కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్షిక తిరుక్కల్యాణోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. శ్రీకూర్మం దేవస్థానం అర్చకుడు గోపినంబాళ్ల నల్లకూర్మానదాసు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు బూరాడ వంశీకృష్ణ నేతృత్వంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఉత్సమూర్తులను ప్రత్యేక మండపంపై ఉంచి మల్లె, బంతి వంటి పూలతో మండపాన్ని అలంకరించారు. ఉత్సమూర్తులను వేదికపై ఉంచి వేద మంత్రాల నడుమ కల్యాణం జరిపించారు. అంతకుముందు నిర్వహించిన శోభాయాత్ర ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎల్.నందికేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, మర్రి యోగేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

\-శ్రీకాకుళం కల్చరల్


శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం


ఊరేగింపులో భక్తులు


అన్నమయ్య కీర్తనల ఆలాపన